సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



రూ.2,00,232 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మద్దిశ్రీనివాసరావు (విశాఖపట్నం) రూ.1,00,116, పిల్లా అమరనాథ్, అపర్ణ (విజయవాడ) రూ.1,00,116 విరాళాలను శనివారం సమర్పించారు. దాతలకు ఈఓ సుబ్బారావు అన్నదానం రశీదు అందచేశారు.




సర్వం సాంకేతిక మయం

ఆధునిక కాలమంతా సాంకేతిక మయం. ప్రయోగాలు, పరిశోధనలే కాదు సామాన్యుడి రోజువారీ జీవితం సైతం సాంకేతిక అంశాలతో నిండిపోయింది.

8లో

4.67 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 4,67,063 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు సంబంధించి 12,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలంలో 33.40 అడుగులకు నీటిమట్టం చేరింది.

అక్షరమే ఆయుధం



పాత్రికేయులపై కేసులు దారుణం



ప్రజాస్వామ్య దేశంలో ప్రతికా స్వేచ్ఛను హరించే విధంగా పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దారుణం. పోలీసుల పదోన్నతుల్లో అక్రమాలు వెలుగులోకి తెచ్చినందుకు 'సాక్షి'పై కూటమి ప్రభుత్వం అక్కసు వెళ్లగక్కుతోంది. అన్యాయంగా కేసులు నమోదు చేసే సంస్కృతికి తెర లేపింది. ఇది ఏ మాత్రం మంచిది కాదు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి, ఇతర పాత్రికేయులపై వేసిన కేసులను కూటమి సర్కారు వెంటనే ఉపసంహరించుకోవాలి.

– సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, అనపర్తి

ప్రజాస్వామ్యానికి పెనుముప్పు



కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అరాచకాలపై 'సాక్షి' దినపత్రికలో ప్రచురించారనే ఆరోపణలతో పోలీసులు కేసులు నమోదు చేయడం, సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి, సిబ్బందిని నిందితులుగా చూపడం హాస్యాస్పదం. కూటమి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పత్రికలపై కేసులు పెట్టి వేధించడం దారుణం. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ హరించే విధంగా కేసులు నమోదు చేయడం పెనుముప్పుకు సంకేతం. పాత్రికేయులకు స్వేచ్ఛ ఇవ్వాలి. లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

– జి.శ్రీనివాసనాయుడు, మాజీ ఎమ్మెల్యే, నిడదవోలు

న్యూస్‌రీల్

పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం వేలాది మంది భక్తులు పోటెత్తారు. స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. శనివారం స్వామి అమ్మవార్లను విశేష అలంకరణ చేయటంతో భక్తులు చూసి పరవశించారు. తెల్లవారుజాము నుంచే వందలాది మంది భక్తులు రావడంతో భక్తులు క్యూలో ఆలయ ప్రాంగణం చుట్టూ నిలబడటంతో దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయానికి వచ్చిన వేలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. భక్తులందరికీ దాతల ఆర్థిక సాయంతో 7 వేల మందికి ఉచిత అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి శనివారం భక్తులకు దాతల సహకారంతో ఉచిత అన్న సమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు.

22న శరన్నవరాత్రులు ప్రారంభం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): స్థానిక దేవీచౌక్‌లో బాలాత్రిపుర సుందరీదేవి 92వ శరన్నవరాత్ర మహోత్సవాలు సెప్టెంబర్ 22 నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు 13 రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీదేవి మహోత్సవ సమితి అధ్యక్షుడు బత్తుల రాజరాజేశ్వరరావు వెల్లడించారు. ఉత్సవ ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నట్టు తెలిపారు. శనివారం స్థానిక దేవి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. రాజరాజేశ్వరరావు మాట్లాడుతూ 21వ తేదీ రాత్రి 9.45 గంటలకు శ్రీదేవి విగ్రహ ప్రతిష్ఠ, 22వ తేదీ ఉదయం 6.18 నిమిషాలకు కలశస్థాపన చేస్తామని తెలిపారు. ప్రతిరోజూ కుంకుమ పూజలు, ఉదయం, సాయంత్రం మంగళవాయిద్యాల నడుమ అఖండ హారతి కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. 28వ తేదీ ఆదివారం 108 దంపతుల పూజ ఉంటుందని, పూజలో పాల్గొన్న వారికి మధ్యాహ్నం భోజన ప్రసాదం అందిస్తామన్నారు. 29వ తేదీన మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ పూజలు ఉంటాయన్నారు. రోజుకో అలంకారంతో అమ్మవారికి పూజలు, రాత్రివేళ నాటకాలు జరుగుతాయన్నారు. 22న స్వర్ణకవచ కనకదుర్గాదేవిగా, 23న గాయత్రీ దేవిగా, 24న అన్నపూర్ణదేవిగా, 25న మహాలక్ష్మిగా, 26న బాలాత్రిపుర సుందరీదేవిగా, 27న శ్యామలాదేవిగా, 28న లలితా త్రిపుర సుందరీ దేవిగా, 29న సరస్వతీదేవిగా, 30న దుర్గాదేవిగా, అక్టోబరు ఒకటిన మహిషాసురమర్దినిగా, రెండున విజయదశమి నాడు రాజరాజేశ్వరిగా అలంకరించనున్నారు. అలాగే ప్రతిరోజూ వివిధ నాటకాలు ఉంటాయని ఉత్సవ కమిటీ తెలిపింది. 12వ తేదీ ఆదివారం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యక్షులు ముత్యాల కుమార రెడ్డి, గంధం భైరవ స్వామి, ఆకుల వెంకటేశ్వరరావు, సెక్రటరీ అల్లక సత్యనారాయణ, కోశాధికారి బత్తుల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు మూడో స్థానం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అప్పాలో నిర్వహించిన 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్ 2025లో జాతీయ స్థాయిలో జరిగిన ప్రిజన్ హైజీన్ పోటీలో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఆ వివరాలను సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ శనివారం తెలిపారు. పురస్కారాన్ని ఆయన హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో స్వీకరించారు. జైళ్లలో పరిశుభ్రత, ఆరోగ్యకర వాతావరణం కల్పించడంతో ఈ స్థానం లభించింది. కేంద్ర కారాగారంలో పనిచేసిన సిబ్బంది సమష్టి కృషిని రాష్ట్ర జైళ్ల శాఖ ఉన్నతాధికారులు అభినందించారని రాహుల్ తెలిపారు. ఈ పురస్కారంతో రాష్ట్ర జైళ్ల శాఖకు గౌరవం చేకూరిందన్నారు.

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూలమాలికలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జీవన చక్రాలకు ఆటోంకం

ఆటో కార్మికుల పరిస్థితి ముందు చూస్తే నుయ్యి వెనుక చూస్తే గొయ్యి అన్న చందంగా మారింది. సీఎం చంద్రబాబునాయుడు ఏకపక్ష నిర్ణయంతో ఆటో కార్మికుల పొట్టకొట్టారని వారు ధ్వజమెత్తుతున్నారు. రోజంతా కష్టపడి ఆటో నడుపుకొని తమ కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికులు నేడు స్త్రీశక్తి ఉచిత బస్సు పుణ్యాన అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఒకనాడు నేను ఆటోవాలాను అని దర్జాగా చెప్పుకునే దశ నుంచి నేడు అడుక్కుతినే పరిస్థితి వచ్చిన వారిని చూసి ప్రతి ఒక్కరూ జాలిపడుతున్నారు.



పెరవలి సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఆటోలు



పెరవలిలో జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న ఆటోడ్రైవర్లు

- రోడ్డున పడిన ఆటోవాలాలు
- పడిపోయిన ఆదాయం
- రోజుకు రూ.500 కూడా రాని వైనం
- జిల్లాలో 21 వేల మందికి పైగా కార్మికులు
- ఎన్నికల వాగ్దానం నిలబెట్టుకోని కూటమి ప్రభుత్వం

పెరవలి: ఆటో నడిస్తేనే జీవనచక్రం తిరిగే కుటుంబాలు నేడు వీధిన పడ్డాయి. ఫైనాన్స్ బకాయిలు కట్టలేక, కుటుంబాలను పోషించుకోలేక, అప్పులు చేయలేక, కడుపునిండా తిండి తినలేక విలవిల్లాడిపోతున్నారు. ఎంతో సాఫీగా సాగే ఆటోవాలాల జీవనం నేడు తెల్లవారితే చాలు ఎలా బతకాలో తెలియక నానా అగచాట్లు పడుతున్నారు. ఒకప్పుడు ఆడుతూ పాడుతూ సాగిపోయిన కుటుంబాలు కాస్తా కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత బస్సు పథకం అష్టకష్టాలు చవిచూపిస్తుంది.

కిరాయిలు లేక, ఆటో ఎక్కే వారు లేక ఏమి చేయాలో తెలియక నానా ఇబ్బందులు పడుతున్నారు. పదులు, వందలు కాదు ఏకంగా జిల్లాలో 21 వేల మంది కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చంద్రబాబు సర్కారు నిర్ణయంతో ఆటోడ్రైవర్లు ఆందోళనలకు శ్రీకారం చుట్టారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి ఇప్పుడు కిరాయిలు లేక నెలవారీ ఈఎంఐలు కట్టలేక ఆటో కార్మికులు సతమతమవుతున్నారు. ఆర్టీసీలో స్త్రీశక్తి పేరుతో ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సుతో తాము ఉపాధి కోల్పోతామని.. తమ బతుకులు వీధిన పడతాయి గత 6 నెలలుగా ఉద్యమాలు చేసి నిరసనలు తెల్పినా ప్రభుత్వానికి కనికరం లేదని ధ్వజమెత్తుతున్నారు. ప్రాంతాన్ని బట్టి రోజుకి 5 నుంచి 10 ట్రిప్పులు వేస్తూ రోజుకి చెల్లించవలసిన అద్దెలు కట్టి ఇంటికి రూ.500 నుంచి రూ.800 వరకు తీసుకెళ్లేవారమని నేడు రోజంతా కష్టపడి ఆటో తిప్పినా కనీసం రూ.500 కూడా రావడం లేదని దీనంగా చెబుతున్నారు. ఇంత దుర్భర పరిస్థితి వస్తుందని తాము ఏనాడు ఊహించలేదని వాపోతున్నారు. ఉచిత బస్సుతో జీవనోపాధి కోల్పోతామని తెలిసినా కనీసం సంప్రదించకుండా ఏకపక్షంగా సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని ఆటో యూనియన్లు తప్పుపడుతున్నాయి. తగిన విద్యార్హత ఉన్నా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు లేక విద్యావంతులు కూడా ఫైనాన్స్‌పై ఆటోలు తీసుకుని కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఉచిత బస్సు ప్రవేశపెట్టిన నాటి నుంచి మహిళలు ఆటోలు ఎక్కడం మానేశారని దీంతో ఉపాధి పోయి ఉసూరుమంటూ రోడ్లపై కాలక్షేపం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, రాజానగరం, కడియం, గోకవరం, రంగంపేట, అనపర్తి, తాళ్లపూడి, పెరవలి, ఉండ్రాజవరం, బిక్కవోలు, కోరుకొండ, దేవరపల్లి మండల కేంద్రాల్లో ఆటోలే జీవనాధారంగా వేలాది కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలన్నీ ఉచిత బస్సు మూలంగా ఇప్పుడు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన తరువాత ఆటోయూనియన్లు బగ్గున లేచి ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం కనికరం లేకుండా అణచి వేసిందని అంటున్నారు. గత ప్రభుత్వం ఆదుకున్నట్టుగా ఎన్నికల్లో మాకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్న వాగ్దానాన్ని నిలబెట్టుకుని ఆర్థిక భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కార్మికులకు వైఎస్సార్ సీపీ పెద్దపీట

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకం ప్రవేశపెట్టి వారి ఉపాధికి భరోసాగా నిలిచింది. ఆటో ఉన్న ప్రతి కార్మికుడికీ ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం చేసి ఆదుకుంది. కోవిడ్ లాంటి కష్ట సమయంలోనూ ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందించి అండగా నిలిచింది.

నానా ఇబ్బందులు పడుతున్నాం



నేను అన్నవరప్పాడు ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌గా ఉన్నాను. గత పదేళ్లలో ఇంత దుర్భర పరిస్థితి ఏనాడూ ఎదురవలేదు. నేడు ఆటో నడుపుతున్న ప్రతి ఒక్కరూ ఫైనాన్స్‌లో అప్పు తీసుకుని ఆటో కొనుగోలు చేసిన వారే నేడు అద్దెలు కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. రోజుకి రూ.1000 నుంచి నేడు రూ.500 కూడా మిగలడం లేదు.

– వాసంశెట్టి రాము, ఆటో యూనియన్ ప్రెసిడెంట్, అన్నవరప్పాడు

ఎలా పోషించాలో అర్థం కావడం లేదు




నిడదవోలు–కానూరు, కానూరు–తణుకు రోజుకి 10 ట్రిప్పులు వేసేవాడిని. నేడు రెండు, మూడు ట్రిప్పులు కూడా వేయలేకపోతున్నాం. రోజుకి ఆదాయం రూ.800 నుంచి రూ.1200 వరకు ఉండేది. నేడు రూ.500 కూడా తేలడం లేదు. మిగులు ఎలా ఉన్నా కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదు. – పంజా దుర్గారావు, ఆటో డ్రైవర్, కానూరు

ఆర్థికంగా నలిగిపోతున్నాం



కుటుంబాలను పోషించలేక ఆర్థికంగా నలిగిపోతున్నాం, రోడ్డెక్కినా కిరాయిలు ఉండటం లేదు. ఉచిత బస్సు పథకం మా ఉపాధికి గండికొట్టింది. గతంలో ఉదయం 6 గంటలకు ఆటో ఎక్కితే సాయంత్రం 6 గంటలకు డ్యూటీ దిగేవాడిని. కానీ నేడు ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు వేచి చూసినా రోజుకి రూ.500 కూడా సంపాదించలేకపోతున్నాం. జీవితం భారంగా మారింది. –ఈతకోట నాగరాజు, ఆటో డ్రైవర్, లంకమాలపల్లి

16 బార్లకు దరఖాస్తులు నిల్



- దరఖాస్తు చేయకుండా తెరవెనుక కూటమి నేతల కుట్రలు
- మొత్తం 25 బార్లకు తొమ్మిదింటికి పూర్తయిన డ్రా
- మిగిలిన వాటికి 17 వరకు గడువు పొడిగింపు

రాజమహేంద్రవరం రూరల్: బార్ల విషయంలో అధికార కూటమి నేతలు కుట్రలు పన్నుతూనే ఉన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అధికార పార్టీ వారంతా సమావేశమై దరఖాస్తులకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు పూర్తయినా అన్ని బార్లకు దరఖాస్తులు రాలేదు. జిల్లాలో కల్లుగీత కార్మికుల బార్లతో కలసి 25 బార్లకుగాను 9 బార్లకు మాత్రమే డ్రా తీశారు. ఇంకా మిగిలిన 16 బార్ల విషయంలో ఎక్సైజ్‌శాఖ అధికారులపై తీవ్ర ఒత్తిడి వస్తోంది. దరఖాస్తు గడువు ఈనెల 17వ తేదీ వరకు పొడిగించినా ఒక్క దరఖాస్తు రాలేదు. అడ్డగోలు షరతులు విధించడంతో బార్లు ఏర్పాటుకు ఎవరూ ఆసక్తి చూపించడం లేదు.

ఒక్కటీ రాలేదు

వాయిదాల మీద వాయిదాలు వేసి నోటిఫికేషన్లు మీద నోటిఫికేషన్లు విడుదల చేసినప్పటికీ జిల్లాలో మొత్తం బార్లకు దరఖాస్తులు రావడం గగనంగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు 18వ తేదీ కూటమి ప్రభుత్వం నూతన బార్ల పాలసీని ప్రకటించింది. జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 22, రిజర్వ్ కేటగిరిలో 3 బార్లు మొత్తం కలుపుకుని 25 బార్లకు లైసెన్సులు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీనికి ఒక్కో బార్‌కు నాలుగేసి దరఖాస్తులు వస్తేనే డ్రా తీయాలని, లేకపోతే రీనోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి దరఖాస్తులు స్వీకరించడం మొదలుపెట్టింది. మొదట ఆగస్టు 26వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ప్రకటించింది. అయితే ప్రభుత్వం ఆశించిన రీతిలో దరఖాస్తులు రాలేదు. దాంతో మరో రెండు రోజుల పాటు దరఖాస్తులకు గడువు పెంచింది. జిల్లాలో మద్యం దుకాణాలను బినామీల ద్వారా నిర్వహిస్తున్న కూటమి నేతల కుట్రలతోనే దరఖాస్తులు రాలేదని ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. దీంతో మొత్తం మీద ఓపెన్ కేటగిరీలో 24 దరఖాస్తులు, గీత కార్మికులకు కేటాయించిన బార్లకు 19 దరఖాస్తులు వచ్చాయి. ఆగస్టు 30న ఓపెన్ కేటగిరిలో ఆరు, రిజర్వ్ కేటగిరిలో మూడు బార్లకు డ్రా తీసి లైసెన్సులు మంజూరు చేశారు. మిగిలిన 16 బార్లు మిగిలిపోయాయి. రాజమహేంద్రవరం 13, కడియపులంక ఒకటి, కొవ్వూరు ఒకటి, నిడదవోలు ఒకటి బార్లు ఉన్నాయి. వాటి కోసం రీ నోటిఫికేషన్ విడుదల చేశారు. అయినా ఒక్క దరఖాస్తు రాకపోవడంతో ఏం చేయాలో తెలియక ఎక్సైజ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కలెక్టర్ కీర్తి చేకూరి

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేస్తానని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. శనివారం నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కీర్తి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో తూర్పుగోదావరి జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రానున్న 2027 గోదావరి మహా పుష్కరాల నేపథ్యంలో ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ, ప్రణాళికతో మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అన్ని స్థాయిల్లో పరిపాలనలో బాధ్యతాయుత ధోరణి కనబరచాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థల ద్వారా అందిస్తున్న సేవలు ప్రజలకు నిజ సమయంలో చేరేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి వాస్తవంగా డివిజన్, మండల స్థాయిలో సరైన పరిష్కారం, సరైన అవగాహన లేకే కలెక్టరేట్‌కి ఎక్కువ మంది వస్తున్నారన్నారు. మనందరం కలసికట్టుగా పనిచేసి జిల్లాను అగ్రగామిగా నిలపడంలో సమన్వయం, పరస్పర సహకారంతో కలసి పనిచేద్దామని కలెక్టర్ కోరారు. సెప్టెంబర్ 15, 16 తేదీల్లో ముఖ్యమంత్రి కలెక్టర్ల కాన్ఫరెన్స్ సందర్భంలో జిల్లాకు చెందిన ముఖ్యమైన సమస్యలు, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో రావలసిన అనుమతులు, నిధుల మంజూరు తదితర అంశాలపై శాఖల వారీగా చర్చించామన్నారు. ద్వారకాతిరుమలలోని శ్రీవారిని కలెక్టర్ బాధ్యతలు చేపట్టడానికి ముందు దర్శించుకున్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆమెకు జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి కలెక్టరేట్ ఏవో ఆలీ, ఆర్డీఓలు రాణీసుస్మిత, ఆర్.కృష్ణనాయక్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు స్వాగతం పలికారు.

వర్జీనియా కిలో ధర రూ.430

దేవరపల్లి: వర్జీనియా పొగాకు ధర మార్కెట్లో రోజురోజుకూ పెరుగుతుంది. ఊహించని విధంగా మార్కెట్లో ధర లభిస్తుండడంతో రైతులు ఆనందంతో ఉన్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి మార్కెట్ ఊహించని మలుపులు తిరుగుతుంది. వారం రోజుల క్రితం వరకు కిలో ధర రూ.350 పలికిన ధర అంచెలంచెలుగా పెరుగుతూ శనివారం మార్కెట్లో కిలో ధర రూ.430 పలికింది. శుక్రవారం కిలో రూ.418 పలికిన ధర, ఒకే రోజు రూ.12 పెరిగి రూ.430 చేరుకుంది. దీంతో ఈ ఏడాది పొగాకు రైతుల ఇంటి లాభాల పంట పండింది.



దేవరపల్లి వేలం కేంద్రానికి వేలానికి వచ్చిన పొగాకు బేళ్లు

అంగన్వాడీల జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ తూర్పుగోదావరి జిల్లా రెండో మహాసభ స్థానిక విక్రమహాల్‌లో శనివారం జరిగింది. ఈ మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంగన్వాడీలకు జీతాలు పెంచాలని, గ్రాట్యుటీ చట్టం ప్రకారం అమలు చేయాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని తీర్మానాలను ఆమోదించారు. సీహెచ్ మాణిక్యాంబ అధ్యక్షురాలిగా, కె.బేబీరాణి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా బి.రామలక్ష్మి, గౌరవ అధ్యక్షుడిగా ఎస్ఎస్ మూర్తి, జిల్లా ఆఫీస్ బేరర్స్‌గా సీహెచ్ అన్నపూర్ణ, బి.మార్తమ్మ, 10 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మహాసభలో అంగన్వాడీ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో, రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న పరిస్థితులను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ వివరించారు. దేశభవిష్యత్తు అయిన బాలలను, గర్భిణుల సంక్షేమం చూసే సేవా కార్యక్రమాన్ని గొప్పగా నిర్వహిస్తున్నారని తెలిపారు. సభలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణకుమారి, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి పాల్గొన్నారు.

కొత్త సార్లొస్తున్నారు..

- 15న ఎంపిక జాబితా విడుదలయ్యే అవకాశం
- 22 నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ
- దసరా సెలవుల తర్వాత విధుల్లోకి..



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో పాల్గొన్న ఉపాధ్యాయ అభ్యర్థులు (ఫైల్)

రాయవరం: డీఎస్సీ–2025 తుది అంకానికి చేరుకుంది. ఈ పరీక్షలో పొందిన మార్కులు, రిజర్వేషన్ తదితర ప్రామాణికాల ఆధారంగా అర్హత పొందిన వారిని గుర్తించి, కాల్ లెటర్లు పంపించారు. ఆ అభ్యర్థులకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ప్రక్రియ పూర్తయ్యింది. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,241 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో తుది జాబితా రూపొందించినట్లు సమాచారం. ఈ జాబితాను జిల్లా కమిటీ ఆమోదం కోసం పంపించాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రోస్టర్, మెరిట్ ఆధారంగా ఉపాధ్యాయ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. జిల్లా సెలక్షన్ కమిటీ ఆమోద ముద్ర వేసిన అనంతరం ఎంపిక జాబితాను ఈ నెల 15 సాయంత్రానికి రాష్ట్ర అధికారులు ప్రకటించే అవకాశముంది.

కొలువుల్లో చేరేవారికి శిక్షణ

కొత్తగా చేరనున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఖాళీలివే..

కేటగిరీ	ప్రభుత్వ/ జెడ్పీ/ మున్సిపల్ మేనేజ్‌మెంట్
ఎస్జీటీ	423
ఎస్ఏ తెలుగు	65
ఎస్ఏ హిందీ	78
ఎస్ఏ ఇంగ్లిష్	95
ఎస్ఏ గణితం	64
ఎస్ఏ పీఎస్	71
ఎస్ఏ బయాలజీ	103
ఎస్ఏ సోషల్	132
ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	210

ఉమ్మడి జిల్లాలో ఎంపిక కానున్న 1,241 మంది ఉపాధ్యాయులకు ఈ నెల 22 నుంచి 29 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. పీజీటీలు, టీజీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, ఫిజికల్ డైరెక్టర్లు, ఎస్జీటీ క్యాడర్‌లో ఎంపిక కానున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెసిడెన్షియల్ విధానంలో ఇచ్చే శిక్షణకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనువైన విద్యా సంస్థలను ఎంపిక చేస్తున్నట్లు సమాచారం. కొత్త ఉపాధ్యాయులు దసరా సెలవుల అనంతరం విధుల్లో చేరే అవకాశముంది.

కృష్ణమోహన్‌కు రాష్ట్రస్థాయి బ్రాహ్మణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక నేషనల్ సీనియర్ బేసిక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వరాహగిరి కృష్ణమోహన్‌ను ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్రస్థాయి బ్రాహ్మణ ఉత్తమ ఉపాధ్యాయుడు 2025గా ఎంపిక ఎంపిక చేసింది. ఈ మేరకు ఆ వివరాలను శనివారం ఆయన తెలిపారు. తొలిసారిగా ఇస్తున్న బ్రాహ్మణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు రాష్ట్ర స్థాయిలో 248 నామినేషన్లు వచ్చాయన్నారు. వాటిలో 53 మందిని ఎంపిక చేసి గుంటూరు బ్రాడీపేట బ్రాహ్మణ సేవాసమితి ఆఫీసులో ఈ నెల 14న అతిథుల చేతుల మీదుగా అవార్డు అందజేయనున్నారన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సీతానగరం: రాజమహేంద్రవరం రూరల్ కాతేరుకు చెందిన వియ్యపు వెంకటేశ్వర్లు (32) సీతానగరంలోని అత్తారింటిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై డి.రామ్‌కుమార్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా.. కాతేరుకు చెందిన వియ్యపు వెంకటేశ్వర్లుకు సీతానగరానికి చెందిన సత్యవేణితో 2017లో వివాహమైంది. కుటుంబ కలహాలతో భార్య సీతానగరంలో ఉంటుంది. భార్య వద్దకు శుక్రవారం వెంకటేశ్వర్లు రాగా సత్యవేణి తన ఇద్దరు పిల్లలను తీసుకుని కొద్ది దూరంలోని బంధువుల ఇంటికి వెళ్లి రాత్రంతా అక్కడే ఉంది. శనివారం ఉదయం సత్యవేణి మేనమామ కాతేరులో ఉన్న మృతుని అన్నయ్య వియ్యపు రామదుర్గ వరప్రసాద్‌కు ఫోన్ చేసి, మీ తమ్ముడు తన బావమరిదితో కలసి రాత్రంతా మద్యం తాగాడని, ఉదయం 7.30 గంటలకు చూస్తే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపాడు. తన తమ్ముడు ఆత్మహత్య చేసుకోలేదని, హత్య చేశారని, విచారణ చేసి దోషులను శిక్షించాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో మృతుడి సోదరుడు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెంలో విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం యర్నగూడెం హోటల్లో పనిచేస్తున్న బాదంపూడి ప్రవీణ్ (19) పక్కింటి వద్ద శుక్రవారం సాయంత్రం మోటారు కనెక్షన్ ఇస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. ప్రమాదంలో గాయపడిన ప్రవీణ్‌ను చికిత్స కోసం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్టు ఎస్సై వి. సుబ్రహ్మణ్యం తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

వివాహిత అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని లాలాచెరువు స్పిన్నింగ్ మిల్లు కాలనీకి చెందిన ఆర్‌వీవీ సత్యనారాయణమూర్తి శనివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కథనం ప్రకారం సత్యనారాయణమూర్తి 28 ఏళ్ల కుమార్తె ఈనెల 2వ తేదీన భర్తతో గొడవపడింది. శనివారం ఉదయం లేచి చూసేసరికి తన కుమార్తె ఇంటిలో కనిపించలేదని, చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదని సత్యనారాయణమూర్తి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు బొమ్మూరు ఎస్సై రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్వం సాంకేతిక మయం

- పెరిగిన ఇంజినీర్ల ఆవశ్యకత
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సద్వినియోగం
- ఇంజినీరింగ్ విద్యనందించడంలో 'కూటమి' నిర్లక్ష్యం
- సంక్షేమాన్ని ఎగ్గొట్టేందుకు సాంకేతికత వాడకం
- రేపు ఇంజినీర్స్ డే



సాంకేతిక పరిశీలనాంశాలను వివరిస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థి

కపిలేశ్వరపురం: ఆధునిక కాలమంతా సాంకేతికమయం. ప్రయోగాలు, పరిశోధనలే కాదు సామాన్యుడి రోజువారీ జీవితం సైతం సాంకేతిక అంశాలతో నిండిపోయింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో విస్తారంగా సాంకేతిక విద్య సంస్థలున్నాయి. ఇంజినీర్లను తయారు చేసే క్రమంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్న వాదన ఉంది. సెప్టెంబర్ 15న ఇంజినీర్స్ డే సందర్భంగా ఈ కథనం..

జిల్లాలో సాంకేతిక విద్యాసంస్థలివే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో 520, 29 ప్రైవేటు కళాశాలల్లో 16,800 ఇంజినీరింగ్ సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది ఈఏపీసెట్ ఇంజినీరింగ్ విభాగంలో కాకినాడ జిల్లాలో 8,666 మంది పరీక్ష రాయగా 6,343 మంది అర్హత పొందారు. కోనసీమలో 3,891 మందికి 2,866 మంది, తూర్పుగోదావరిలో 7,416 మందికి 6,011 మంది మొత్తం 15,220 మంది అర్హత పొందారు. కాకినాడ జిల్లాలో రెండు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 644 సీట్లు, 12 ప్రైవేటు కళాశాలల్లో 1,400 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 14 ప్రభుత్వ, 44 ప్రైవేటు వృత్తి విద్యా కళాశాలలున్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రామచంద్రపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు మరో ఐదు ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. రంపచోడవరం, రాజమహేంద్రవరంలలో ఒక్కొక్కటి చొప్పున ప్రభుత్వ, ఐదు ప్రైవేటు, కాకినాడ జిల్లాలో పిఠాపురంలో ఒకటి, కాకినాడలో రెండు ప్రభుత్వ, 9 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి.

సాంకేతిక విద్యపై విద్యార్థుల ఆసక్తి

జూలై 4న కాకినాడ జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయ 11వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 35 మందికి బంగారు, 99 మందికి పీహెచ్‌డీ పట్టాలు, 5 నగదు పతకాలు, అందజేశారు. సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ, సమగ్ర శిక్షా, ముస్కాన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఏడాది జూలై 28న పిఠాపురంలోనూ, 29న అమలాపురంలోనూ స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంపులను నిర్వహించగా విద్యార్థులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. రాజానగరం ఆదికవి నన్నయ యూనివర్శిటీ క్యాంపస్‌లో జూలై 14 నుంచి 19 వరకూ క్వాంటం టెక్నాలజీపై ఏఐసీటీఈ– ఏటీఏఎల్ స్పాన్సర్డ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. జాతీయ స్థాయి పరీక్షల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు తమ ప్రతిభను చాటారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్యలో సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకూ అమలు చేశారు. 3వ తరగతి నుంచే టోఫెల్ క్లాసులు నిర్వహించడంతో పాటు 8వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్యాబులు అందించింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ఇచ్చారు.

సాంకేతిక విద్యపై కూటమి నిర్లక్ష్యం

డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు వేధిస్తున్నాయి. సుమారు రూ.15 వేలు చొప్పున నాలుగు నుంచి ఏడు క్వార్టర్ల వరకూ చెల్లించాల్సి ఉంది. వాటిని చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది. వాటి భారాన్ని మోయలేక డీమ్డ్ యూనివర్శిటీలుగా మారేందుకు కళాశాలల యాజమాన్యాలు ప్రయత్నాలు చేస్తుండటం వల్ల రానున్న రోజుల్లో ఈఏపీసెట్ ప్రాధాన్యం తగ్గిపోయే ప్రమాదం ఉంది.

కూటమి పాలనలో తప్పులు

ఆధునిక సాంకేతికతను సామాన్యుల కోసం వినియోగించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ఈ–కేవైసీ పేరుతో రేషన్ కార్డుల్లో కోత పెట్టిందన్న వాదన ఉంది. యాప్‌ల ద్వారా సర్వే పేరుతో దివ్యాంగులు తదితరుల పింఛన్లలో కోత పెట్టింది. మే 15న ఈసెట్ ఫలితాలు విడుదల చేసినప్పటికీ నెలన్నర తర్వాత జూలైన 4నుంచి కానీ కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇవ్వలేకపోయింది. రాష్ట్రంలో డీఎస్సీ ఒకే రోజు ఒకే సమయానికి రెండు పరీక్షలకు హాజరు కావాలంటూ హాల్ టికెట్లు జారీ చేయడంతో అభ్యర్థులు ఇబ్బందులకు గురయ్యారు. స్మార్ట్ రేషన్ కార్డులు తప్పుల తడకగా మారాయి. సాంకేతికతతో నేరాలను అదుపు చేస్తున్నామని కూటమి నేతలు చెబుతున్నప్పటికీ అందుకు భిన్నంగా ఏడాది కాలంలో కాకినాడ జిల్లాలో సుమారు వెయ్యికిపైగా ఆన్‌లైన్ మోసాల కేసులు నమోదయ్యాయి.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

సెపక్‌తక్రా పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పి.గన్నవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో భాగంగా ఈనెల 11న కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి సెపక్‌తక్రా సెలక్షన్స్‌లో పీఎంసీ పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం కోసూరి ఉమాదేవి తెలిపారు. అండర్–17 బాలికల విభాగంలో మట్టపర్తి అవంతి, అండర్–14 బాలికల విభాగంలో కడలి హిరణ్యవల్లి, అండర్–17 బాలుర విభాగంలో గుమ్మళ్ల నితీష్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆమె వివరించారు. వీరిని పేరెంట్స్ కమిటీ సభ్యులతో పాటు, వ్యాయామోపాధ్యాయులు ఎం.దుర్గాప్రసాద్, కె.భీమేంద్ర తదితరులు అభినందించారు.

ఉమ్మడి జిల్లాలో 42 బెంచ్‌ల్లో లోక్ అదాలత్

- పరిష్కరించిన కేసులు 4,453
- బాధితులకు రూ.16.35 కోట్ల నష్టపరిహారం



బాధితులకు నష్టపరిహారం అందజేస్తున్న ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాధురి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రమాదవశాత్తూ మృతి చెందిన వారి కేసుల్లో రాజీ పడ్డ వారు నష్టపరిహారానికి ఎక్కువ కాలం వేచి ఉండనవసరం లేదని, ఇన్సూరెన్స్ కంపెనీ లబ్ధిదారుడు తన బ్యాంక్ అకౌంట్ తెలిపితే నెల రోజుల్లోనే లబ్ధిదారుని ఖాతాలోనే జమ చేస్తారని ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.మాధురి తెలిపారు. ఉమ్మడి జిల్లాలైన తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏఎస్ఆర్ జిల్లాల్లో శనివారం 42 బెంచ్‌లలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. దీనిని జిల్లా కోర్టులో ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.మాధురి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఇరువర్గాల సమస్య రాజీతో కూడిన పరిష్కారం అవుతుందన్నారు. లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో తూర్పుగోదావరి జిల్లా ముందంజలో ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో 4453 కేసులను పరిష్కరించారు. బాధితులకు రూ.16.35 కోట్ల నష్టపరిహారాన్ని అందేలా చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎస్.ఉమా సునంద, ఎల్.వెంకటేశ్వరరావు, ఎస్‌కే.జానీబాషా, బి.పద్మ, కె.ప్రకాష్‌బాబు, ఎన్.శ్రీలక్ష్మి, టి.రాఘవేంద్ర, జి.శ్రీనివాస్‌రెడ్డి, పి.బాబు, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.రమేష్ పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనపై దృష్టి సారించాలి



వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సుందరంను జ్ఞాపికతో సత్కరిస్తున్న నరసింహారావు, విజయ్‌ప్రకాష్

తుని: విద్యార్థులు జ్ఞాన సముపార్జనపై దృష్టి సారించాలని భారతీయ వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌ఎం సుందరం సూచించారు. స్థానిక స్పేసెస్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన యువ ప్రేరణ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల ఆలోచనల్లో సృజనాత్మకత లేకపోతే యాంత్రికంగా మిగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు పరీక్షల కోసం కాకుండా జీవిత లక్ష్యాల సాధనకు సమర్థ ప్రణాళికలు రచించాలన్నారు. సవాళ్లను అధిగమించి అవకాశాలను అందిపుచ్చుకునేలా సంసిద్ధులై ఉండాలని చెప్పారు. మరో అతిథి, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు సాధించే మార్కులు వారి మేధస్సుకు కొలమానం కాదన్నారు. లక్ష్యసాధన వైపు అడుగులేయాలంటే కఠోరశ్రమ, పట్టుదల ఎంతో అవసరమన్నారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు.

ఫెన్సింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



భార్గవ్



నాగవరుణ్

అమలాపురం రూరల్: మలికిపురం మండలం మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ ఫెన్సింగ్ జిల్లా ఎంపికల్లో అమలాపురం మండలం ఎ.వేమవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–17 బాలుర విభాగంలో డి.భార్గవ్, అండర్–14 విభాగంలో ఎ.నాగవరుణ్ ప్రతిభ కనబరచి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని కనకదుర్గ తెలిపారు. విద్యార్థులను సర్పంచ్ రావూరి వెంకటలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ దాసం విజయదుర్గ, వ్యాయామోపాధ్యాయుడు బీవీవీఎస్ఎస్ మూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు లింగోలు సత్యవతి, నాయకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

11 కిలోల గంజాయి పట్టివేత

- ఒకరి అరెస్టు, మరొకరు పరారీ
- ద్విచక్ర వాహనం స్వాధీనం

కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని చీడిపాలెం జంక్షన్‌లో శనివారం సాయంత్రం చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా 11.07 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై కిషోర్‌వర్మ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై గంజాయి తరలిస్తూ కాకినాడ జిల్లా కత్తిపూడికి చెందిన పెరుమలకోవెల జోగేంద్ర పట్టుబడ్డారన్నారు. అతని వెనుక కూర్చున్న అదే జిల్లా చేబ్రోలుకు చెందిన కర్రి పవన్‌కుమార్ దూకి పారిపోయాడన్నారు. జోగేంద్రను అరెస్టు చేసి, అతని నుంచి నాలుగు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. బైక్‌ను సీజ్ చేసినట్టు చెప్పారు. తప్పించుకున్న పవన్‌కుమార్ కోసం గాలింపు చేపట్టినట్టు ఆయన వివరించారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో కోలుకుంటున్న వేంకటేశ్వరరావు

అన్నవరం: ఐదేళ్ల క్రితం ప్రభుత్వ స్థలాన్ని ప్రవేట్ స్థలంగా నమ్మించి తన బంధువులకు విక్రయించి మోసం చేసిన వారిపై చర్య తీసుకోవాలని పోలీసులను, పెద్దలను ఆశ్రయించినా న్యాయం జరగలేదని మనస్తాపానికి గురైన అన్నవరం దేవస్థానం శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.వేంకటేశ్వరరావు శుక్రవారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. అయితే సకాలంలో అతడిని తునిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించడంతో అక్కడ చికిత్స పొందుతున్నారు. ఎటువంటి ప్రాణపాయం లేదని వైద్యులు చెప్పినట్టు ఆయన కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వరరావు రాసిన లేఖలో వివరాల ప్రకారం.. ఆయన 2021లో మధ్యవర్తిగా ఉండి తన తోడల్లుడు తెల్లాపు రవికుమార్, మరదలు వేంకట సత్యదీప్తి కోసం బెండపూడి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 114–16ఏ, 114–17ఏ లో రియల్ ఎస్టేట్ వెంచర్‌లోని 33 నెంబర్ ప్లాట్‌ను రూ.25 లక్షలకు స్థానిక వ్రతపురోహితుడు నాగాభట్ల సీతారామం వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఐదేళ్ల అనంతరం ఈ ఏడాది ఆగష్టు 14న ఆ స్థలాన్ని ఎల్ఆర్ఎస్ నిమిత్తం కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆఫీసులో సంప్రదించగా అది ప్రభుత్వ భూమి అని తేలిందని తెలిపారు. దాంతో ఆ భూమి విక్రయించిన నాగాభట్ల సీతారామంను డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగ్గా తాను రియల్ ఎస్టేట్ వెంచర్‌లో దానిని కొన్నానని ఆ వెంచర్ వేసిన వారినే అడగాలని అంటున్నాడని అందులో పేర్కొన్నారు. దీనిపై తొండంగి పోలీసులను ఆశ్రయించినా, పెద్దల వద్ద పంచాయితీ పెట్టినా న్యాయం జరగలేదని పేర్కొన్నారు. దాంతో తనకు గత్యంతరం లేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పేర్కొన్నాడు. కాగా, తుని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వేంకటేశ్వరరావును దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు శనివారం పరామర్శించారు. వేంకటేశ్వరరావుకు స్థలం అమ్మిన నాగాభట్ల సీతారామంను ఈ వ్యవహారంపై ప్రశ్నించగా తాను ఇల్లు కట్టుకుందామని ఆ ప్లాట్ కొనుక్కున్నానని కాని తన తండ్రి అనారోగ్యం కారణంగా 2021లో విక్రయించానని తెలిపారు. అది తన పూర్వార్జితం కాదని అది ప్రభుత్వ భూమి అన్న విషయం తనకు తెలియదని తెలిపారు. ఆ రియల్ ఎస్టేట్ వెంచర్ వేసిన వారినే అడగాలని ఆయనకు చెప్పానని తెలిపారు.

మృతదేహం గుర్తింపు



ఏలేశ్వరం: పట్టణంలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం మెట్లపై మృతదేహాన్ని గుర్తించారు. వయస్సు 50 ఉంటుందని భావిస్తున్నారు. శరీరంపై నిక్కరు మినహా ఏమీలేవు. బక్కపలుచగా ఉన్నాడు. మతిస్థిమితం లేనివాడని భావిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

బ్యాంకు మేనేజర్‌ని బురిడీ కొట్టించిన మహిళ

- రియల్ ఎస్టేట్ పేరుతో రూ. 1.30 కోట్లు తీసుకున్న మహిళ
- సొమ్ము అడిగితే అత్యాచారం కేసు పెడతానని బెదిరింపులు
- రూ.4.93 లక్షల నగదు, బంగారం రికవరీ



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు ఆభరణాలు

నిడదవోలు: రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే మంచి లాభాలు వస్తాయని ఓ బ్యాంక్ మేనేజర్‌ను మాయ మాటలతో నమ్మించి, అతని వద్ద నుంచి భారీ మొత్తంలో నగదు తీసుకున్న మహిళపై నిడదవోలు పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. నిడదవోలు పట్టణ సీఐ తిలక్ తెలిపిన వివరాల ప్రకారం. నిడదవోలు పట్టణంలో గతంలో పనిచేసిన ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ చప్పిడి శ్రీనివాస్ వద్ద నుంచి పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన అంబటి ఉమా (అలియాస్ శ్రావ్యారెడ్డి) దఫదఫాలుగా రూ.1.30 కోట్లు తీసుకుంది. నూజివీడు ఇతర ప్రాంతాల్లో పొలాలు ఉన్నాయని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే మంచి లాభాలు వస్తాయని చెప్పి మాయమాటలు చెప్పి బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌ను నమ్మించింది. ఈ క్రమంలో లోన్ వంకతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి భారీ మొత్తం కావాలంటూ పలుమార్లు బ్యాంకు మేనేజర్ వద్దకు వచ్చేది. ఇలా తరుచుగా వస్తూ పెద్ద మొత్తంలో నగదు తీసుకుంది. బ్యాంకు మేనేజర్ బంధువులు, తెలిసిన వారి వద్ద నుంచి సొమ్ములు తీసుకుని నిందితురాలు అంబటి ఉమకు ఇచ్చారు. ఆ డబ్బులతో విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తూ బంగారం కూడా కొనుగోలు చేసింది. తీరా రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా లేదని మోసపోయినట్లు బ్యాంకు మేనేజర్ గ్రహించారు. తీసుకున్న రూ.1.30 కోట్లు డబ్బులు ఇవ్వాలని ఆమెను బ్యాంక్ మేనేజర్ చప్పిడి శ్రీనివాస్ తరచూ అడిగేవారు. ఈ క్రమంలో డబ్బుల గురించి అడిగితే అత్యాచారం చేశావని, నన్ను వాడుకొని మోసం చేశావని కేసు పెడతానని నిందితురాలు మేనేజర్‌ను బెదిరించింది. ఈ మేరకు బ్యాంకు మేనేజర్ చప్పిడి శ్రీనివాసరావు పట్టణ పోలీసులను ఆశ్రయించి ఆమెపై ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్సై జగన్ మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా శనివారం విద్యానగర్‌లో నిందితురాలు అంబటి ఉమను అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి నుంచి రూ.4.93 లక్షల నగదు, 312.020 గ్రాముల బంగారు వస్తువులు, ఆండ్రాయిడ్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముద్దాయి అంబటి ఉమా వలలో పడి నిడదవోలు చుట్టుపక్కల మరి కొంతమంది కూడా మోసపోయినట్లు తెలిసింది. కేసును ఛేదించిన సీఐ పీవీ తిలక్, ఎస్సై జగన్‌మోహన్‌రావులను కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ అభినందించారు.